# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మందిరాల ద్వారా ఆరోగ్య సేవలు ప్రతి గ్రామానికి చేరువయ్యాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- దౌత్య మార్గాల ద్వారా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని భారత్ సూచిస్తోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఉద్ఘాటించారు.
- దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.
- హార్ముజ్ జలమార్గం ద్వారా ముడిచమురు సరఫరాకు అంతరాయం కలగడంతో ఈరోజు బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆవిష్కరణ ఆధారిత ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బడ్జెట్ అనంతర వెబినార్‌లో భాగంగా ''సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ - ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం'' అనే అంశంపై ఈ రోజు నిర్వహించిన నాలుగో వెబినార్‌లో నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ లక్ష్యాలను చేరుకోవడంలో విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, పర్యాటకం, క్రీడలు, సంస్కృతి వంటి రంగాలు ప్రధాన చోదకాలుగా పని చేస్తాయని చెప్పారు. గడచిన కొన్నేళ్లుగా దేశంలో ఆరోగ్య మౌలిక వసతులు బలోపేతమయ్యాయని చెప్పారు. వందకు పైగా జిల్లాలలో వైద్య కళాశాలలు ప్రారంభమైయ్యాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మందిరాల ద్వారా ఆరోగ్య సేవలు ప్రతి గ్రామానికి చేరువయ్యాయని ప్రధానమంత్రి తెలియజేస్తూ…

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దౌత్య మార్గాలు, చర్చల ద్వారా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని భారత్ సూచిస్తోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ రెండవ విడత బడ్జెట్ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఉభయ సభల్లోనూ విపక్షాలు పశ్చిమాసియా పరిస్థితిపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. సభాపతి ప్రాంగణంలోకి వెళ్ళి ప్లకార్డులతో గందరగోళం సృష్టించడంతో జైశంకర్ పశ్చిమాసియా ప్రస్తుత పరిస్థితిపై భారత్ వైఖరిని, ఆ ప్రాంతంలో ఉన్న కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి ప్రకటన చేశారు. పశ్చిమాసియా ప్రాంతంలోని ఘర్షణలు భారతదేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలపైన గణనీయమైన ప్రభావం చూపుతాయని, మన ఇంధన భద్రతకు ఆ ప్రాంతం ఎంతో కీలకమన్నారు. అదే విధంగా లక్షలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారని చెప్పారు. వారి గురించే భారత్ ఆందోళన చెందుతోందని, అక్కడ చిక్కుకొన్న వారిని తిరిగి తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని జైశంకర్ స్పష్టం చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

భారత వినియోగదారుల ప్రయోజనాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని, అందుకే అవసరమైనచోట మన ఇంధన సంస్థల ప్రయత్నాలకు దౌత్యమార్గాల ద్వారా మద్దతు ఇచ్చామని వివరించారు. ఈ సంక్షోభ సమయంలో సంయమనం పాటించి, దౌత్యమార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత ప్రభుత్వం ఫిబ్రవరి 20న ప్రకటన విడుదల చేసిందని కేంద్రమంత్రి గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్ సభ ఈరోజు పలు మార్లు వాయిదా పడింది. అజెండా అంశాల ప్రకారం సభాపతి ఓం బిర్లాపై ఈరోజు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సి ఉండగా.. విపక్షాలు దానిని విస్మరించి పశ్చిమాసియాపై చర్చ చేపట్టాలని నిరసనలు కొనసాగించారు. దీంతో స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ పశ్చిమాసియాపై విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటన చేసినందున ఇక దానిపై చర్చకు అవకాశం లేదని చెప్పినా విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన జగదాంబికా పాల్ సభను రేపటికి వాయిదా వేశారు. ఇక రాజ్యసభలో ఈరోజు అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖపై చర్చ చేపట్టారు. ఆ తరువాత విదేశాంగ మంత్రి పశ్చిమాసియాపై జైశంకర్ ప్రకటన చేశారు. ఆ సమయంలో కూడా విపక్షాలు జైశంకర్ ప్రకటనకు అడ్డు పడటంతో వారికి నిజంగా చర్చ చేపట్టాలని ఆసక్తి లేదని, కేవలం సభలో గందరగోళాన్ని సృష్టించాలానే కోరుకుంటున్నారని సభా నాయకుడు జే పీ నడ్డా విమర్శించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ లో 4 కోట్ల లీటర్ల చమురు నిల్వలున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే యోచనలో ప్రభుత్వం లేదని తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఆందోళనల కారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన సరఫరాకు ఆటంకాలను అధిగమిస్తూ.. సరఫరా సాఫీగా జరిగే విధంగా పలు చర్యలు తీసుకుంటున్నట్లు పెట్రోలియం సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. ప్రస్తుతం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రాంతాల నుంచి చమురు ఎగుమతులకు అవాంతరాలు ఎదురవుతున్న దృష్ట్యా.. ప్రత్యామ్నాయ దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్నట్టు ఆయన రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ప్రధాన చమురు ఉత్పత్తి చేస్తున్న దేశాలతో, అంతర్జాతీయ సంస్థలతో దౌత్య సంబంధాలను ప్రతిష్టపరుచుకుంటున్నట్టు సురేష్ గోపి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని, విమానసేవల భద్రతకు కూడా చర్యలు తీసుకుంటోందని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈరోజు రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.. డిజీసీఏ విమానయాన సంస్థలతో తక్షణ చర్చలు జరుపుతోందని, నూరు శాతం భద్రత ఉన్నప్పుడే విమానాలు నడపాలని సర్క్యులర్లు పంపుతోందని తెలిపారు. పశ్చిమాసియాలోని విమానాశ్రయాలకు విమానాలు నడపవలసి వస్తే.. భద్రతా చర్యలను సమీక్షించేందుకు నియంత్రణ సంస్థ పలు సమావేశాలు నిర్వహించిందని వెల్లడించారు. విమానయాన సంస్థలు కూడా ప్రయాణికులకు ఎప్పటికప్పుడు ప్రత్యేక సూచనలు పంపుతున్నాయని, ప్రయాణికులు కూడా విమానాల రాకపోకలకు సంబంధించి నిర్దిష్టమైన సమాచారం తెలుసుకుంటూ ఉండాలని, విమాన ప్రయాణాల రద్దు లేదా మార్పుల గురించి అయోమయానికి గురికా వద్దని సూచిస్తున్నాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. గత వారంలో పశ్చిమాసియాలోని పలు గమ్యస్థానాలకు మన దేశం నుంచి 90 వేల మంది ప్రయాణించారని, తగిన జాగ్రత్తలతో విమాన సర్వీసులు సాగుతున్నాయనడానికి ఇది నిదర్శనమని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా - ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య ఘర్షణలు 10వ రోజుకు చేరుకున్నాయి. తమ దేశానికి చెందిన రక్షణ వ్యవస్థ అనేక డ్రోన్, క్షిపణి దాడులను ఈరోజు నిలువరించంగలిగిందని UAE ప్రకటించింది. ఇరాన్ భూగర్భ క్షిపణి మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా భారీ వైమానిక దాడులు జరిపాయి. రాబోయే రోజుల్లో తమ దాడులను ఇంకా విస్తృతం చేస్తామని అమెరికా ప్రకటించింది. దీంతో యుద్ధం మరింత తీవ్రమయ్యింది. ఇదిలా ఉండగా ఇరాన్ తమ దేశపు తదుపరి సుప్రీం లీడర్ గా మోజ్తాబా ఖమేనీని ఎన్నుకుంది. ఆయనకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ అభినందనలు తెలిపారు. ఇరాన్ కు రష్యా మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితికి తోడు హార్ముజ్ జలసంధి ద్వారా ఇంధన ప్రవాహానికి అంతరాయం కలగడంతో అంతర్జాతీయ మార్కెట్లు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ ముడి చమురు ధరలు ఈరోజు బ్యారెల్ 100 డాలర్ల మార్క్ ను దాటింది. 2022 తరువాత ఇంత ధరకు చేరుకోవడం ఇదే తొలిసారి. నౌకల ద్వారా చమురు రవాణాకు అంతరాయాలు కూడా అంతర్జాతీయ విపణిలో ధర భారీగా పెరగడానికి కారణమైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నమీబియా నుంచి రప్పించిన చీతా “జ్వాల” ఈరోజు మధ్యప్రదేశ్‌లోని కూనో అభయారణ్యంలో ఐదు కూనలకు జన్మనిచ్చిందని కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో పెరుగుతున్న చిరుత కూనల సంఖ్య 33కు పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. భారత గడ్డ మీద ఇప్పటి వరకు 10 కూనలు పుట్టాయనీ, ఇది భారత చిరుతల సంరక్షణ ప్రస్థానంలో కీలక పురోగతిని సూచిస్తోందని ‘ప్రాజెక్ట్ చీతా’లో ఇది ఓ గర్వకారణ ఘట్టమని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 77 వేల 056 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 1,352 పాయింట్ల నష్టంతో 77 వేల 566 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 422 పాయింట్ల నష్టపోయి 24 వేల 028 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =